ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసి లక్ష్మారెడ్డి



కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి శనివారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును శంభీపూర్‌లోని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక మెజారీతో మల్కాజ్‌గిరి స్థానాన్ని కైవసం చేసుకునేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, ప్రభుత్వ వైఫల్యాలపై విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.

అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లిన కారు



సుభాష్‌నగర్: కారు అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లిన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. సూరారం కాలనీకి చెందిన దుర్గారావు.. గాగిల్లాపూర్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. తన కారు(ఏపీ 28 బీ డబ్ల్యూ 8304)లో రోజు మాదిరిగా శనివారం డ్యూటీకి వెళ్లొస్తున్నాడు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో సూరారం కట్ట మైసమ్మ ఆలయం వద్దకు రాగానే కారు ఒక్కసారిగా అదుపుతప్పి పక్కనే ఉన్న లింగయ్య చెరువులోకి దూసుకెళ్లింది. చెట్ల పొదల్లోకి కారు దూసుకెళ్లడంతో దుర్గారావు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న సూరారం పోలీసులు అక్కడ చేరుకొని క్రేన్ సాయంతో వాహనాన్ని బయటకు లాగారు.

హెల్త్ వర్కర్లకు సత్కారం



హెల్త్ వర్కర్లకు రిజిస్టర్లు అందజేస్తున్న రైతు నాగరాజు

సుభాష్‌నగర్: ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో హెల్త్ వర్కర్ల పాత్ర ఎంతో కీలకమని దూలపల్లికి చెందిన రైతు నాగరాజు యాదవ్ అన్నారు. శనివారం దూలపల్లికి చెందిన ప్రభుత్వ హెల్త్ వర్కర్లు స్వరూప, జానకి, సరస్వతి, మాధురి చేస్తున్న సేవలను గాను నాగరాజు యాదవ్ వారిని సత్కరించారు.

కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం



శ్రీశైలంగౌడ్‌ను ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లిలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం రేపు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసి కల్యాణ ఆహ్వాన పత్రిక అందజేశారు. శ్రీశైలంగౌడ్‌ను కలిసిన వారిలో దూలపల్లి బీజేపీ నాయకులు రమేశ్, అశోక్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చారిత్రక నిర్ణయం

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీఆర్ఎస్ నేత, రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సంపత్ మాధవరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని, పార్టీలకు అతీతంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించండి



కాలనీవాసులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు తదితరులు

నిజాంపేట్: సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి కాలనీ అభివృద్ధికి సహకరించాలని మదర్ థెరిస్సా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పితాని శ్రీనివాసరావు కోరారు. శనివారం నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలో ఇంటింటికీ పర్యటిస్తూ ఆస్తి పన్నులు చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆస్తి పన్నులు చెల్లిస్తే కాలనీలో మౌలిక సదుపాయాలు సమకూరుతాయన్నారు.

కల్యాణం.. కమనీయం



వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం త్రయోదశి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం భూదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించగా.. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటకు అన్న సమారాధన, సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై ఊరేగించారు.

ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి రద్దు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని, ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం యథవిధిగా కొనసాగుతుందని తెలిపారు.

'పది'కి పకడ్బందీ ఏర్పాట్లు

రేపటి నుంచి ఏప్రిల్ 2 వరకు కొనసాగనున్న పరీక్షలు

- 896 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 46,834 విద్యార్థులు
- జిల్లా వ్యాప్తంగా మొత్తం 231 ఎగ్జామ్ సెంటర్లు
- పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు గాలి, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు
- మంచినీటితో పాటు కనీస వసతి, ప్రథమ చికిత్స శిబిరం
- ఉత్తమ ఫలితాల లక్ష్యంతో విద్యార్థులను తీర్చిదిద్దాం..
- 'సాక్షి'తో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి తెలిపారు. విద్యార్థులకు బోర్డు పరీక్షలంటే ఎలాంటి భయం లేకుండా రాసేలా సన్నద్ధం చేశామని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో మంచినీటి వసతులతో పాటు కనీస సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. పరీక్షల నేపథ్యంలో 'సాక్షి'కి శనివారం ఇచ్చిన ఇంటర్వ్యూను ఆమె మాటల్లోనే పరిశీలిద్దాం..



- విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక తరగతులు నిర్వహించి, సన్నద్ధం చేశాం. డిసెంబరు వరకు సిలబస్ పూర్తి చేసి తర్వాత ప్రాక్టీసు టెస్టులు, నాలుగు రివిజన్ టెస్టులు నిర్వహించాం. ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాం. వీటి నిర్వహణతో విద్యార్థుల్లో పరీక్షలంటే ఉండే భయం పోయి అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా సిద్ధమయ్యారు.
- పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 62 ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలు 834 ఉండగా, మొత్తంగా 46,834 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. ఇందులో బాలురు 24,034మంది, బాలికలు 22,800 మంది ఉన్నారు. వీరికి 231 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం.
- పదో పరీక్షలు సాఫీగా జరిగేలా జిల్లావ్యాప్తంగా మొత్తం 2,769 మంది సిబ్బందిని నియమించాం. 231 పరీక్షా కేంద్రాల్లో 2,310 మంది ఇన్విజిలేటర్లు, 10 మంది ఫ్లయింగ్ స్క్వాడ్, ఒక చీఫ్ సూపరింటెండెంట్, 20 మంది కస్టోడియన్లు, మరో 25 మంది అదనపు కస్టోడియన్లు, 8 మంది రూట్ ఆఫీసర్లను నియమించాం.
- విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. అప్పుడే వారు ప్రశాంతంగా ప్రశ్నపత్రాన్ని ఆసాంతం చదివి సమాధానాలు రాస్తారు. పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఆయా కేంద్రాల పరిధిలో బస్సులు సమయానికి నడిపేలా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్టీసీ సంస్థను కోరాం. కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేసేలా పోలీసు శాఖను కోరాం. పరీక్షలు జరిగినన్ని రోజులు జిరాక్సు కేంద్రాలు మూసి ఉంచేలా చర్యలు తీసుకున్నాం. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతి లేదు.
- జిల్లాలో సమస్యాత్మక కేంద్రాలు లేవు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కలిపి ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స శిబిరం ఏర్పాటు చేశాం. "పరీక్షా సమయాల్లో కరెంటు సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు పరీక్షా రాసే కేంద్రాల్లో గాలి, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకున్నాం.

వేడుకగా వీడ్కోలు సభ



కార్యక్రమంలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న సీఐ



చిన్నారుల నృత్యాలు

కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్‌లోని వివేకానంద విద్యామందిర్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు మండవ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని, ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా పరీక్షల ఒత్తిడిని ఎలా అధిగమించాలో అవగాహన కల్పించారు. అనంతరం క్యూఎంఆర్ఎస్ఎంఏ ప్రధాన కార్యదర్శి రవికుమార్‌తో కలిసి పరీక్ష సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. చివరిగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.సునీత, వైస్ ప్రిన్సిపాల్ పి.లత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గ్రాడ్యుయేషన్ డే

కుత్బుల్లాపూర్: సుచిత్రలోని సెయింట్ ఆంథోనీ హైస్కూల్‌లో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు శనివారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సుందరరాజు, ప్రిన్సిపాల్ సరిత, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీఎన్ఆర్ వార్షికోత్సవం



సంగీత విభావరిలో పాటలు ఆలపిస్తున్న గాయకులు

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ వీజేఐఈటీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అనంత్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు సుబ్బారావు, డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త శ్రీనివాస మూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొనగా.. కళాశాల ప్రధాన కార్యదర్శి జేఎస్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అపజయాలు కూడా విద్యార్థులకు విజయాలు సాధించి పెడతాయని, మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సిన్టిలేషన్స్ 2కె24లో భాగంగా నిర్వహించిన సంగీత విభావరిలో గాయకులు హరిచరణ్, రమ్య బెహరా, దినకర్ కల్వ తమ గానంతో ఆహుతులను అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధాన అధ్యాపకులు సి.డి.నాయుడు, సంచాలకులు చెన్నకేశవరావు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

బోరు నుంచి కలుషిత జలాలు సరఫరా



సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని బంధనవాజ్ బస్తీ శంకరయ్య భవానీ ఎన్‌క్లేవ్‌లో పది రోజులుగా బోరు నుంచి కలుషిత జలాలు వస్తున్నాయి. ఎగువ ప్రాంతమైన ప్రగతినగర్ ఆనుకుని అలీప్ ఇండస్ట్రీస్ నుంచి వచ్చే నీరు దేవేందర్‌నగర్ మీదుగా కాల్వ నుంచి దిగువ ప్రాంతానికి ప్రవహిస్తోందని స్థానికులు చెబుతున్నారు. రెండేళ్లుగా దిగువకు వెళ్లే కాల్వలన్నీ కబ్జాకు గురికావడంతో పాటు అలీప్ పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను ఇటువైపు మళ్లించడంతో సమస్య తలెత్తిందని తెలిపారు. ఈక్రమంలో కొన్ని రోజులుగా ఘాటైన వాసనతో కూడిన ఎరుపు రంగులో నీరు వస్తోందని, ఆ నీటితో స్నానాలు చేస్తే దద్దుర్లు వస్తున్నాయని చెప్పారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి ట్యాంకర్లు తెప్పించుకుంటున్నామని ఆవేదన చెందారు. అధికారులు తక్షణమే స్పందించి డ్రైనేజీ వ్యవస్థని పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

'వేముల'ను పరామర్శించిన కార్పొరేటర్



నిజాంపేట్: కార్యకర్తల సంక్షేమానికి పెద్ద పీట వేసే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని నిజాంపేట్ కార్పొరేటర్ చిట్ల దివాకర్ అన్నారు. శస్త్ర చికిత్స చేయించుకున్న ఎన్ఆర్ఐ కాలనీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వేముల శ్రీనివాస్‌ను శనివారం కార్పొరేటర్ పరామర్శించారు. త్వరలో కోలుకుని.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని అభిలాషించారు. కార్పొరేటర్ వెంట డివిజన్ నాయకులు భాస్కరాచారి, వేణు, సురేంద్ర, వీర ప్రతాప్, గణపతి రావు, సందీప్, సాయి గౌడ్, ఆంజనేయ వర్మ, మధుకర్ రెడ్డి, జితేందర్ రెడ్డి ఉన్నారు.

జీరో కరెంటు బిల్లు కోసం క్యూ..



సుభాష్‌నగర్: గృహజ్యోతి పథకం ద్వారా జీరో కరెంట్ బిల్లు రాని లబ్ధిదారులు డివిజన్ నెహ్రూనగర్ వార్డు కార్యాలయం వద్ద శనివారం ఉదయం 8 గంటలకే చేరుకొని.. సిబ్బందికి మరోసారి ధ్రువపత్రాలు అందించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వాసన్ ఐ కేర్ వైద్యులు

నిజాంపేట్: నిజాంపేట్ బండారి లేఅవుట్‌లోని కమ్యూనిటీ హాలులో శనివారం మన సేవా టూ మ్యాన్‌కైండ్ స్వచ్ఛంద సంస్థ, కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కంటి పరీక్షలతో పాటు హియరింగ్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. యశోద ఆస్పత్రి(హైటెక్‌సిటీ బ్రాంచ్) సౌజన్యంతో కార్డియాలజీ, జనరల్, ఆర్థోపెడిక్, అప్తమాలజీ, డెంటల్ పరీక్షలు, అదేవిధంగా వాసన్ ఐ కేర్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, ప్రైమ్ రిహాబ్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో చిన్నారులు, పెద్దలకు హియరింగ్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన శిబిరంలో 300 మంది పరీక్షలు చేయించుకున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి



సదస్సులో పాల్గొన్న సీఐ, స్కూల్ కరస్పాండెంట్

సుభాష్‌నగర్: విద్యార్థులు చదువుతో పాటు టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని సూరారం సీఐ వెంకటేశం అన్నారు. సూరారం వెంకట్రామ్‌నగర్‌లోని నార్త్ సిటీ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులు నిర్వహించిన జీ–20 నమూనా సదస్సును ఆయనతో పాటు స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్ ముదిరాజ్ ప్రారంభించారు. విద్య, వైద్య, ఆర్థిక, వ్యవసాయం, ఉగ్రవాద నిర్మూలన తదితర అంశాలపై సదస్సులో స్కూల్ విద్యార్థులు చర్చించారు.

ఎన్నికల కోడ్ పాటించాల్సిందే



అధికారుల సమావేశంలో పాల్గొన్న పులి సైదులు

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో శనివారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు పలువురు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాజకీయ పక్షాలు కోడ్ పాటించేలా చూడాలని, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నామినేషన్లు మొదలుకుని ఉప సంహారణలు, ఓటింగ్, ఫలితాలు వెలువడేంత వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో బీఎల్‌ఓలు, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారి వెడల్పు కోసం రాస్తారోకో



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

జగద్గిరిగుట్ట: గత పాలకులు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సీపీఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట ఐలమ్మ చౌరస్తా నుంచి ఇందిరమ్మ విగ్రహం వరకు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ట్రాఫిక్ జామ్‌కు కారణమైన జగద్గిరిగుట్ట పైపు లైన్ రోడ్డును వెడల్పు చేయాలని కోరారు. ఇదే విషయంపై గతంలో అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో నేతలు రాములు, హరినాథ్‌రావు, శ్రీనివాస్, ఇమామ్, ఆశప్ప, పాపిరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మొండి బకాయిల వసూళ్లలో వేగం



షెడ్డును సీజ్ చేస్తున్న ఉప కమిషనర్ మల్లారెడ్డి

కుత్బుల్లాపూర్: మొండి బకాయిల వసూళ్లపై గాజులరామారం సర్కిల్ అధికారులు వేగం పెంచారు. మార్చి 31లోగా టార్గెట్ పూర్తి చేసే దిశగా ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ డబ్బులు చెల్లించని పక్షంలో సీజ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం హెచ్ఏఎల్ కాలనీ ప్రధాన రహదారి నుంచి ఉషా ముళ్లపూడి ఆస్పత్రి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొండిబకాయిదారుల నుంచి ఉప కమిషనర్ మల్లారెడ్డి పన్నులు వసూలు చేశారు. ఇప్పటికే సుమారు రూ.28 కోట్లు పన్నులు వసూలు చేయగా.. మరో రూ.8 కోట్లు నెలాఖరులోగా వసూలు చేసే దిశగా ముందుకు సాగుతున్నారు.

'కేంద్ర ప్రభుత్వ కుట్రలు తిప్పికొడతాం'



షాపూర్‌నగర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కుత్బుల్లాపూర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బలహీన పరిచేందుకే బీజేపీ, కాంగ్రెస్‌లు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని ఆ పార్టీ నాయకులు ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత అక్రమ అరెస్టును నిరసిస్తూ శనివారం షాపూర్‌నగర్‌లోని ఉషోదయ టవర్స్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రధానమంత్రి మోదీ, దర్యాప్తు సంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాంతీయ పార్టీలను కూకటివేళ్లతో పెకిలించేందుకు రెండు జాతీయ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను కీలుబొమ్మలుగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితను అనైతికంగా అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ఎంపీ ఎన్నికలను వేదికగా చేసుకొని కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈక్రమంలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిలో కార్పొరేటర్లు కె.జగన్, మంత్రి సత్యనారాయణ, రావుల శేషగిరి, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నేతలు పాల్గొన్నారు.



నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు



నరేంద్ర మోదీ చిత్రపటానికి చెప్పల దండ వేస్తున్న మహిళలు